# 49. అనుకున్నదొకటి - అయినది మరొకటి

మా పెళ్లయిన నాలుగేళ్లకి నాకు ఎకాఎకిని శ్రీకాకుళం జిల్లా టెక్కలి తాలూకా నుంచి గుంటూరు జిల్లాకి ట్రాన్స్ఫరయింది. సర్వేపార్టీలో ఉన్నప్పుడు నన్ను "హెడ్ సర్వేయరు" అనేవారు. గ్రామకరణం కుటుంబంలో పుట్టినా సర్వేయరు అన్న మాటకి అర్థం తెలియకనో లేక నన్ను ఏడిపించాలనో; నండూరి రామమోహన రావుగారు "హెడ్ సర్వేయరు అంటే ఏమిటి; తలకాయల్ని కొలుస్తారా?" అని అడిగేరు. తానొకటి తలిస్తే తలకాయ మరొకటి తలచిందని కొత్త సామెత సృష్టించలేక; హెడ్ మాస్టరు, హెడ్కానిస్టేబుల్, లాగే అని ఆయనకి బోధపరిచేను. గుంటూరుకి ట్రాన్స్ఫరవగానే నా ఉద్యోగం పేరు "హెడ్ సర్వేయర్" నుంచి "డిస్ట్రిక్ట్ సర్వేయర్" గా మారింది. తెలుగులో "జిల్లా సర్వేయర్" అనేవారు. "డిస్ట్రిక్ట్" అనే మాటని "జిల్లా" గా అనువాదం చేసేరు గాని "సర్వేయర్" అనే మాటకి అనువాదం నాటికీ నేటికీ లేనట్టే వుంది.

ఆ రోజుల్లో "జిల్లా సర్వేయర్" కి ఇద్దరు ఫ్యూన్లు ఉండేవారు. ఒక ఫ్యూన్ కేవలం ఆఫీసులో కాగితాలు, వాటిని బంధించే దస్త్రాలు-అటూఇటూ మొయ్యడం మాత్రమే చేసేవాడు. రెండో ఫ్యూను నెలకొకసారి జీతం తీసుకోడానికి మాత్రమే ఆఫీసుకి వస్తూ మిగతా రోజులల్లానూ ఇంటిపనీ స్వంత పనీ శ్రద్ధగా చేసేవాడు. ఇతనే, నేను క్యాంపులు వెళ్లేటప్పుడు నాకూడా వచ్చేవాడు. (ఇప్పుడు జిల్లా సర్వేయర్ అనే పోస్టూ లేదు; ఆ రకం ఫ్యూన్లూ లేరు - అది వేరేసంగతి.)

నేను గుంటూర్లో వున్నప్పుడు ఇంటిపనీ స్వంతపనీ చేసిన ఫ్యూన్పేరు మాధవన్ నాయర్. కేరళ రాష్ట్రం నుంచి వచ్చినా సరే, తెలుగు బాగానే మాట్లాడేవాడు. (అప్పుడప్పుడు "ఈ కుర్చీ బాగున్నాడు సార్" లాంటి ప్రయోగాలు చేసినా అతని తెలుగు "జెనరల్" గా బాగానే వుండేది.)

మేం గుంటూర్లో కాపరం పెట్టిన కొద్ది రోజులకి శ్రావణ మాసం వచ్చింది. మా ఆవిడ ఏదో నోము తలపెట్టి పేరంటాళ్లకి తాంబూలాలు ఇవ్వాలని ముచ్చటపడి ఒక రూపాయి మా నాయర్ కిచ్చి "చెక్కలూ ఆకులూ పట్రా" అని చెప్పింది. అతను ఐదు నిమిషాల్లో వచ్చేడు.

వెనకాల ఒక మనిషి. వాడి నెత్తిమీద కర్రల మోపు. నాయర్ చేతిలో విస్తళ్లకట్ట. "చెక్కస్తోను పదణాలు. కూలి రెండణాలు. ఆకులు నాలుగణాలు." అని పదహారణాలకీ లెక్క చెప్పి చేతులు దులుపుకున్నాడు. మా ఆవిడ తెల్లమొహం వేసింది. "నువ్వు లోపలికెళ్లు." అని మా ఆవిడకి పురమాయించి నేను ఇంకో రూపాయి తీసి నాయర్ కిచ్చి "తమలపాకులూ వక్కలూ తీసుకురా" అని చెప్పేను. "ఇంతకు ముందే చెప్పవచ్చుగా." అంటూ వెళ్లాడతను. నేను ఇంట్లో కెళ్లి "ఇక్కడ చెక్కలూ ఆకులూ అంటే కట్టెలూ, విస్తరాకులూ అని అర్థం" అని మా ఆవిడని సముదాయిస్తూ వుండగా నాయర్ తిరిగి వచ్చేడు. "సున్నాలు వద్దా, సార్?" అంటూ, "సున్నాలు అంటే 'సున్నం' అనే అర్థం వెంటనే గ్రహించి 'వద్దు' అని చెప్పేను. (సున్న పక్కని సున్న పెడితే సున్నం అవుతుంది; అలాగే "సున్నాలు" కూడా అవుతుంది కదా.)

★★★

ఆమధ్య నేను ఒక ప్రయాణంలో ఉండగా ఒక పత్రిక ఎడిటర్ గారు తారసపడ్డాడు.

(ఇంగ్లీషులో దీనికి మా గొప్ప ఇడియమ్ వుంది - "ఐ ర్యాన్ ఇంటు ఎన్ ఎడిటర్" అని. ముక్కస్య ముక్కార్థంగా చెపితే "నేను ఒక ఎడిటర్‌లోకి పరుగెత్తాను." అవుతుంది!) ఈ సందర్భంగా ఒక పాతజోకు -

ఒకడు : నాటకము లెన్నిరకములు, అవి ఏవి?

రెండోవాడు : నాటకము లైదురకములు.

ఒకడు : నీ మొహం. ఐదెక్కడ, నాలుగేగా!? పౌరాణిక నాటకాలూ, చారిత్రాత్మక నాటకాలూ, సాంఘిక నాటకాలూ, రేడియో నాటకాలూ!

రెండోవాడు : మరి పరిషత్తు నాటకాల మాటేమిటి; అవి వేరేరకం కదా!

ఈ దామాషాలో ఎడిటర్లు కూడా మూడు రకాలున్నారు. ప్రింట్‌లైన్‌లో ఎడిటర్ అని తమ పేర్లు వేసుకున్నా సరే; అసలు పత్రిక ఎలా వస్తోందో, దాంట్లో ఏం వేస్తున్నారో చూడడానికి తీరిక లేనివారు; రాత్రీ పగలూ శ్రమపడి పత్రిక ఈ చివర్నించి ఆ చివరిదాకా అక్షరం అక్షరం పరిశీలించి ఆమోదించే బాధ్యతని మోస్తూ కూడా ఎక్కడా తనపేరు లేకపోయినా ఏమీ అనుకోనివారు; నిజంగా "ఎడిటింగు"చేస్తూ పేరుకూడా వేయించుకోగలవారు.

నాకు తారసపడ్డది మొదటిరకం ఎడిటర్‌గారు. (అంటే "ఫస్టు క్లాస్ ఎడిటర్" అనే అర్థం వస్తుంది కాబోలు. వస్తేరానీ, ఏం చేస్తాం!) "ఏంటిసార్; మీరీమధ్య (మాకు) ఏమీరాయడం మానేశారు?" అని నన్ను పరామర్శించారు. "ఏదో, ఎప్పటికప్పుడు అలా అయిపోతుంది!" అని సంజాయిషీ చెప్పుకొని; "రెండు కథలున్నాయి, పంపిస్తాను" అన్నాను; నా కథ ఒకటి సిద్ధంగా ఉండడం, నా జూనియర్ ఒకాయన ఒక కథ రాసి తెచ్చి మా ఇంట్లో వదిలేసి "దీనికేదైనా దారి చూపిద్దురూ గురూజీ!" అని అడగడం - గుర్తొచ్చి. "మహాప్రసాదం" అని ఆ ఎడిటరు గారు ఫేడవుట్ అయ్యారు.

నేను ఇల్లు చేరగానే రెండు కథలూ ఆ పత్రికకి పంపించేను. నా జూనియర్ రాసిన కథ గురించి "దీనిమీద రచయితగా అతని పేరు ఉన్నాసరే; ఇందులో ప్రతిమాటా నేను చూచి, తూచి, దిద్దినవే సుమండీ" అని స్ట్రాంగ్‌గా రికమెండేషన్ చేసేను. రెండూ వేసుకోమని కోరేను.

నిజానికి అతని కథే నా కథ కన్నా మంచిదని కూడా రాశాను. కాని, ఆ ఎడిటర్ గారు తన పత్రిక మరుసటి సంచికలో నా కథ వేసేస్తూ నా జూనియర్ రాసిన కథని (తిరుగు టపా స్టాంపులు పెట్టకపోయినా సరే) తిరుగుటపాలో వెనక్కి పంపేశారు. నా కథని ఆ పత్రికలో చదివిన ఒక మిత్రుడు నాకు ఉత్తరం రాస్తూ "అంత మంచికథ ఆ పత్రిక కెందుకు పంపేవు?" అని చివాట్లు పెట్టేడు.

★★★

"నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చెయ్యవు - అన్నారు ఆరుద్ర -" అని సంభాషణ ప్రారంభించేడు మా బావ వెంకన్న; మొన్నీమధ్య ఒకరోజున.

"ఎందుకు చెయ్యకపోవాలి." అన్నాను.

మా బావ, జేబులోంచి ఒక ఆడియో కేసెట్ తీశాడు. "ఇది చూడు, నీకే తెలుస్తుంది"

అని ఇచ్చాడు.

"ఏ. ఎం. రాజా పాడిన పాటలతో ఒక ఆడియో కేసెట్ వచ్చిందా? ఇన్నాళ్లకి ఎవరికో ఒక మంచి బుద్ధిపుట్టిందే!" అంటూ ఆ కేసెట్‌కున్న కాగితపు తొడుగు విప్పాను. (ఫ్లాప్ అనొచ్చు. కాని ఆమాటని "సినిమా ఫ్లాప్ అయింది" అనే వాక్యంలో ఉన్న ఫ్లాప్‌గా అర్థం చేసుకుంటారని "కాగితపు తొడుగు" అన్నాను.)

"పక్కయింటి అమ్మాయి, అమర సందేశం సినిమాల్లో పాటలు ఒకటికూడా చేర్చకుండా ఏ.ఎం. రాజా పాటల ఆడియో కేసెట్ తయారు చేసేరు. వీళ్లకి ఏదో ఎవార్డు ఇయ్యవలసిందే!' ' అన్నాడు మాబావ.

"ఇందులో అమర సందేశం సినిమాలోది ఒకపాట ఉందికదా?" అన్నాను. "బి" సైడు ఆఖరి పాటకిచ్చిన ఇండెక్సు చూపిస్తూ.

"ఇండెక్సులో అలాగే వేసేరు. మధుర మధుర - చిత్రం : అమర సందేశం; రచన : ఆరుద్ర; సంగీతం : ప్రసాదరావు. కేల్కర్ - అనీ. లోపల కేసెట్‌లో ఉన్నది మాత్రం ఆ పాట కాదు. మధుర మధుర మీ చల్లనిరేయి - 'విప్రనారాయణ' సినిమాలో పాట. 'మధురం, మధురం - మనోహం' - అని; అది వేరు."

"అయితే ఏంటంటావు?" అన్నాను.

"నిర్దేశించిన భావాలను వాక్యాలు బట్వాడా చెయ్యవు - అనే కాకుండా - ఉద్దేశించిన పాటలను యంత్రాలు రికార్డు చెయ్యవు - అని కూడా ఆరుద్ర గారు రాసుండవలసింది."

నేను కేసెట్ నెంబరూ అవీ రాసుకున్నాను. "హెచ్.ఎం.వి; ఎస్.పి.హెచ్.ఓ. "33218; ఎకానమీ; ఆర్.పి.జి. ఎంటర్‌ప్రైజెస్, వెల రు.22-00."

"ఎందుకవన్నీ రాసుకున్నావు; ఏదైనా కన్స్యూమర్ కౌన్సిల్‌కి రాస్తావా?" అని అడిగాడు మా బావ.

"కాదు. ఈ కేసెట్ కొనకుండా జాగ్రత్త పడదామని." ★

# 50. కొత్త సంవత్సరం - పన్ను బాధ

"వీడెవడో చూడు, ఏడాది తిరక్కుండా రెండు లక్షల రూపాయలు అప్పుతీర్చేడట!" అని మా ఆఫీసరు గారిచ్చిన కాగితం చదివేను. నిజమే. ఒక (జాతీయం చేయబడిన) బేంక్ మేనేజరు రాసేరు ఆ ఉత్తరం. దానికి జతపర్చి ఒక స్టేట్‌మెంటుంది. కె.వి. హరినారాయణరావు అనే ఆసామీ ఆ బేంక్‌లో 1991 జనవరిలో రెండు లక్షల రూపాయలు అప్పు తీసుకున్నాడు, ఇల్లు కట్టుకుంటానని. అప్పుకోసం దరఖాస్తు పెడితే బేంక్ వాళ్లు, ఆ స్థలం కొన్నప్పుడు హరినారాయణ రావుకి దఖలు పడిన దస్తావేజు, దానిమీద ఫలానా కొలతలతో ఇల్లు కట్టబోతున్నానని మున్సిపాలిటీకి సమర్పించిన ప్లాను (ఆమోదంతో సహా) ఇంకా ఇంకా న్యాయవాది అభిప్రాయం, ఇంజనీరు అభిప్రాయం, సబ్ రిజిస్ట్రారు అభిప్రాయం ఇలా ఏవేవో తాకట్టుగా పుచ్చుకుని, నాలుగు వాయిదాలలో అతనడిగిన రెండు లక్షల రూపాయలు అప్పూ